రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతమైన మల్కాపురంలో రోడ్డుప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు త్రినాధపురం గ్రామానికి చెందిన ప్రకాష్‌గా గుర్తించారు. అతడి వయసు సుమారుగా 32 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందజేత

విశాలాంధ్ర-పి.ఎం.పాలెం : చందనోత్సవం రోజున సింహాచలం కొండపై గోడ కూలిన దుర్ఘటనలో మరణించిన ముగ్గురు భీమిలి నియోజవర్గం వాసుల కుటుంబాలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ ఆదివారం నష్ట పరిహారం చెక్కులను అందించారు. సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్న చంద్రంపాలేనికి చెందిన పిల్లా ఉమా మహేష్, శైలజ దంపతుల కుటుంబీకులకు, అడవివరానికి చెందిన స్టీల్ ప్లాంట్ ఉద్యోగి యడ్ల వెంకట్రావు కుటుంబానికి ఒకొక్కరికి రూ.25 లక్షల ప్రభుత్వ సాయాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి అందజేశారు. గోడ కూలి ఏడుగురు మరణించడం విచారకరమని, బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా రవితేజ పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమిలి ఆర్డీఓ కె.సంగీత్ మాధుర్, పార్టీ నాయకులు పి.వి.నరసింహం, లొడగల అప్పారావు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, సోంబాబు, గరే గుర్నాథ్, పంచదార్ల శ్రీనివాస్, గుసిడి శంకర్రావు, జానకిరామ్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో శాప్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : శాప్ వార్షిక వేసవి కోచింగ్ క్యాంపులుగా నిర్వహించడానికి 50 క్యాంపులను మంజూరు చేసినట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డిఎస్ఏ) జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సంఘాలు, శారీరక విద్య ఉపాధ్యాయులను శిబిరాల నిర్వహణ కోసం కోచ్‌లు, సీనియర్ ప్లేయర్‌లుగా క్యాంప్ ఎన్‌చార్జ్‌లుగా నామినేట్ చేశారు. మే 5 నుండి 31 వరకు జరిగే శిబిరాలకు 28 విభాగాలను సిఫార్సు చేశారు. ఈ 50 శిబిరాలతో పాటు డిఎస్ఏలో పనిచేసే అన్ని కోచ్‌లు కూడా ఉదయం 6 నుండి ఉదయం 9 గంటల వరకు మరియు మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 6.30 గంటల వరకు వారి సాధారణ కోచింగ్ వేదికలలో శిబిరాలను నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న పిల్లలు క్యాంప్ ఇన్‌ఛార్జికి నివేదించవచ్చని, క్యాంప్ సమయంలో ప్రతిభ గుర్తింపు జరుగుతుందని తెలిపారు.

క్రీడల్లో పాల్గొనడం వలన ఉత్సాహం కలుగుతుంది

ఏయూ వీసీ ఆచార్య జిపి రాజశేఖర్

విశాలాంధ్ర -విశాఖపట్నం : క్రీడలలో పాల్గొనడం వలన ఉత్సాహన్ని ఇస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.పి. రాజే శేఖర్ అన్నారు. ఏయూ న్యూజిమ్మాజియంలో ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ పురుషులు మహిళల పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక స్థానం కల్పించిందని, యువత క్రీడల్లో విరివిగా పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడలకు ప్రత్యేకమైన సహకారాన్ని కూడా అందిస్తుందన్నారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి, డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయమోహన్ మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులకు ఉపాధికల్పించేవిధంగా ప్రభుత్వం ఉద్యోగాల్లో 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఒక విశాఖపట్నం జిల్లాల్లో క్రీడా కోటా 32 పోస్టులు ప్రకటించడం పట్ల ప్రభుత్వంకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయలు పోస్టులు భర్తి చేసే విధంగా డిఎస్సీలో వి రివిగా పోస్టులు ప్రకటించడంపట్ల ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలోకోచ్ ఆనందబాలు, వివిధ కిక్ బాక్సింగ్ యూనియన్ అ ఫీసియల్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నయనానందంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం వైభవంగా నిర్వహించారు. %ా% ప్రధాన అర్చకులు అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆదేశాల మేరకు ఏ.ఈ.ఓ ఆనంద్ కుమార్ పర్యవేక్షణలో అర్చక స్వాములు వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపము లో వేదికపై అధిష్టింపజేసి వేద మంత్రాలు నాథ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణ పుష్పార్చన ఆర్జిత సేవలు నయనాందంగా జరిగాయి. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవ మూర్తి గోవింద రాజ స్వామిని మండపంలో అధిష్టింప జేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళా శాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చిల్లపేట చెరువు అభివృద్ధికి ప్రణాళిక

విశాలాంధ్ర -భీమిలి: భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు యువ నాయకులు గంటా రవితేజ ఆదివారం ఉదయం భీమిలి

తగరపువలస రోడ్డులో గల చిల్లపేట చెరువును సందర్శించారు. సదరు చిల్లపేట చెరువు అభివృద్ధికి గతంలో 2014-19లో గంటా శ్రీనివాసరావు రాష్ట్ర మంత్రిగా ఉన్నప్పుడు 1 కోటి 98 లక్షలు మంజూరు చేసి ఉన్నారు. అనంతరం 90 లక్షల రూపాయలతో వాకింగ్ ట్రాక్ మరియు ఇతర నిర్మాణాలు చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారిన దరిమిలా చెరువు అభివృద్ధికి నోచుకోక చెరువులో నీరు పాడై దుర్గంధమై, తుప్పలు పెరగడంతో చెరువు అంతా కల్మషం అయిపోయినది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ ఈ పరిస్థితిని శాసనసభ్యులు వారి దృష్టిలో ఉన్నదని త్వరలో చిల్లపేట చెరువు అభివృద్ధికి అధికారులను అప్రమత్తం చేసి తక్షణమే తగు చర్యలు చేపట్టే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భగీరథుని కఠోర శ్రమ, దీక్ష మరువలేనిది : మంత్రి సవిత

గాజువాక దుర్గానగర్‌లో భగీరథుని విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-గాజువాక : భగీరథ మహర్షి మహా జ్ఞాని అని పరోపకారానికి దీక్షకు సహనానికి ప్రతిరూపమని ఎంత కష్టాన్నైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే వారిని వెనుక బడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత , జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. భగీరథుని వారసులుగా సగరులు ఎంతో పట్టుదల, శ్రమ, నిజాయితీతో ఉంటారని కొనియాడారు. భగీరథుని ఆశయాలను కొనసాగించాలని, ఆయన చూపిన సంకల్ప బలంతో బీసీ వర్గాల్లోని సామాన్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం 71 వ వార్డు, గాజువాక దుర్గానగర్ లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి భగీరథ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భగీరథ మహర్షి జయంతి మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భగీరథ మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా మంత్రివర్యులు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి భగీరథుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ ఎస్ సత్యనారాయణ , బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, భగీరథుని కఠోర శ్రమ మరియు కష్టపడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. జిల్లాలో 60 కోట్ల రూపాయల అంచనాలతో 2500 యూనిట్లు మంజూరు చేయనున్నారని, ఇప్పటికే 400 యూనిట్లు గుర్తించామని తెలిపారు. పేదలకు మెరుగైన జీవనం అందించేందుకు 'బంగారు కుటుంబం' వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నంలో 73 వేల బంగారు కుటుంబాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, స్థానిక కార్పొరేటర్లు,వార్డు సభ్యులు బీసీ సంఘం నాయకులు, ప్రజలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మరుగునపడిన పారిశుధ్యం

ఆనందపురం గ్రామంలో పారిశుధ్య లోపం

విశాలాంధ్ర-అనందపురం: మండలంలో ఆనందపురం గ్రామపంచాయతీలో పారిశుధ్యం పూర్తిగా లోపించిందని జై జవాన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్ తెలిపారు. డ్రైనేజీ శుభ్రం చేయకపోవడం వలన ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి తద్వారా ఈగలు దోమలు చేరి గ్రామ ప్రజలు తీవ్ర అనారోగ్యాలు బారిన పడుతున్నారని, వెంటనే పంచాయతీలో ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేయాలని, అలాగే 7 నెలలుగా పెండింగ్‌ల ఉన్నపారిశుధ్య కార్మికులు జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

నేటి నుండి వెంకటాద్రిపై 'బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు'

విశాలాంధ్ర-పెందుర్తి : ఉత్తరాంధ్ర తిరుపతిగా విరాజిల్లుతున్న పెందుర్తి వెంకటాద్రిపై బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు మే 5నుండి జరుగు తాయని ఆలయ ప్రధానార్చకులు మోర్తా రామానుజాచార్యులు తెలియజేశారు. ప్రతీ సంవత్సరం వైశాఖ మాసంలో జరిగే ఈ ఉత్సవాలకి చరిత్ర వుందని, శ్రీనివాసుడు భూమి మీదకి అడుగిడిన రోజు, పద్మావతి అమ్మవారిని వివాహమాడిన రోజు వైశాఖ శుద్ధ దశమి అని, అదేరోజున వెంకటాద్రిపై స్వామివారి ప్రతిష్ఠ జరిగిందని వెల్లడించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా వైశాఖ శుద్ధ దశమినాడు స్వామి అమ్మ వారిని వివాహమాడిన రోజునే, వెంకటాద్రిపై స్వామివారి కళ్యాణం చేసుకుంటామన్నారు. నాటి ఆ శ్రీనివాసుని కళ్యాణం మనం చూడలేదన్న వెలితి లేకుండా, ఈనాడు మన స్వామివారి కళ్యాణం మనం చేసుకుని, చూసి తరిద్దాం..రండి భక్తులకు రామానుజాచార్యులు పిలుపునిచ్చారు. మే 5 సోమవారం సాయంత్రం విష్వక్సేనపూజ, అంకురారోపణలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమోతాయని, 6మంగళవారం ఉదయం ద్వజారోహణ, హోమాలు, సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పములతో స్వామికి విశేష అర్చన, 7 బుధవారం సాయంత్రం స్వామి వారి కళ్యాణం, 8 గురువారం సాయంత్రం తిరువీధి స్వామి వారి రథోత్సవం జరుగుతాయని తెలిపారు. ఏడాదికి ఒకసారి స్వామివారు రథంపై ఊరేగింపుగా, తప్పెట గుళ్ళు, పులి వేషాలు, చెక్క భజనలు, కోలాటాలు, గోవిందనామ స్మరణల నడుమ సప్తగిరినగర్‌లోని అలిమేలు మంగమ్మ ఆలయానికి వెళ్ళి వేడుకలు చేసుకుని వస్తారని చెప్పారు. 9 శుక్రవారం ఉదయం చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలసి భక్తులు దివ్య స్నాన మాచరించడం, సాయంత్రం శ్రీపుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవలతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి అవుతాయని రామానుజాచార్యులు తెలియజేశారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పీఎం పాలెం : సిపిఐ విశాఖ జిల్లా 25వ మహాసభ జయప్రదం చేయాలని మధురవాడ ఏరియా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం జీవీఎంసీ జోనల్ కార్యాలయం సమీపంలో ఎస్బిఐ బ్యాంకు దగ్గర గోడ పత్రిక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మధురవాడ ఏరియా సిపిఐ పార్టీ కార్యదర్శి వి.సత్యనారాయణ మధురవాడ ఏరియా ముఠా కార్మికులు పాల్గొన్నారు. ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ నాయకులు కామ్రేడ్ నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి పాల్గొంటారన్నారు. మే 10వ తారీఖున కంచరపాలెం జరిగే బహిరంగ సభకు వేలాదిమంది విశాఖ జిల్లా ప్రజలు భవన్ నిర్మాణం కార్మికులు ముఠా కార్మికులు కమ్యూనిస్టు పార్టీ నాయకులు వేలాదిమందిగా పాలుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ జిల్లా మహాసభ ఉద్దేశించి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు విశాఖ రైల్వే జోన్ సింహాచలం పంచ గ్రామాల భూ సమస్యలు అనేక అంశాలపై చర్చించి ఉంటాయని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక నాయకులు అప్పలరాజు, రాంబాబు, సోములు, కన్నయ్య, పెంటయ్య తదితరు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

యువత శారీరక ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- ఫిట్ ఇండియాలో భాగంగా సైక్లింగ్ కార్యక్రమం
- యుజిసి సౌజన్యంతో ఏయులో నిర్వహణ

విశాలాంధ్ర-విశాఖపట్నం : యువతరం వ్యాయామాన్ని జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలని ఏయు ఉపకులపతి ఆచార్య జి.పిరాజశేఖర్ అన్నారు. ఆదివారం ఉదయం ఏయు పరిపాలన భవనం వద్ద యుజిసి ఆదేశాలతో ఆంధ్ర విశ్వ విద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన సైక్లింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపకులపతి ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ ఫిట్ ఇండియా మిషన్లో భాగంగా యుజిసి యువతలో శారీరక వ్యాయామం, ఆరోగ్యం పట్ల అవగాహనపెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యుజిసి అందిస్తున్న సూచనలను స్వీకరిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈకార్యక్రమాన్ని నేడు ప్రారంభించామని తెలిపారు. ఫిట్నెస్ కా డోస్ ఆదా గంట రోజ్ అనే నినాదంతో ఈకార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. వివిధ పోటీ పరీక్షలతో తలమునకలై ఉండే యువత నిత్యం తమ సమయాన్ని శారీరక వ్యాయామానికి సైతం కేటాయించాలని సూచించారు. తద్వారా వారికి మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం లభించడం, శారీరక, మానసిక ఆరోగ్యం పటిష్టంకావడం సాధ్యపడుతుందని తెలిపారు. పౌరులు ఒత్తిడితో కూడిన జీవనాన్ని సాగిస్తున్నారని, దీనినుంచి బయటపడడానికి వ్యాయామం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. ఏయూ క్రీడా విభాగం ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడంపట్ల సంతోషం వ్యక్తం చేశారు. క్రీడా విభాగ సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ యువతతో పాటు నగర పౌరులను సైతం ఈకార్యక్రమంలో భాగం చేస్తూ విస్తృత అవగాహన కల్పన కార్యక్రమం ప్రధాన ఉద్దేశంఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులతోపాటు నగరానికి చెందిన క్రీడాకారులు, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఏయూ పరిపాలన భవనం నుంచి ప్రారంభమైన ఈసైక్లింగ్ కార్యక్రమం సిరిపురం కూడలి మీదుగా ఏయూ పరిపాలన భవనం వరకు కొనసాగింది.

నవ్వు వల్ల అనేక ప్రయోజనాలు

విశాలాంధ్ర-మల్కాపురం : నవ్వు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అందుకే ఎల్లప్పుడూ సంతోషంగా నవ్వుతూ బతకడం చిన్న వయసు నుండి అలవాటు చేసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ- నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని, ఆరోగ్య సమస్యలు మటుమాయం అవుతాయని, స్నేహ సంబంధాలు పెరుగుతాయని, సానుకూల దృక్పథం ఏర్పడుతుందని అన్నారు. ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా హాస్య కథలను, జోక్స్ ను చిన్నారులు చెప్పారు. వీరందరినీ గ్రంథాలయాధికారి వి. అజయ్ కుమార్ అభినందించారు. ముఖ్యంగా పిసినారి కథ, రేచీకటి అల్లుడు మొదలైన కథలు బాలలను ఎంతో అలరించాయి.ఈ సందర్భంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలను చదివి ఇండియన్ బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించిన జి.సంధ్య అనే పాఠకురాలికి సత్కారం జరిగింది. సంధ్యను స్ఫూర్తిగా తీసుకుని బాలలు గ్రంథాలయాన్ని వినియోగించు కోవాలని భాగ్యలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.అజయ్ కుమార్, సన్మాన గ్రహీత సంధ్య ప్రసంగించారు. అనంతరం బాలలు ఆటపాటలతో అలరించారు.

వైసీపీ కోవర్టుగా పల్లా శ్రీనివాస్..!

తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ విమర్శ

విశాలాంధ్ర -విశాఖపట్నం: చంద్రబాబు నాయుడును వైసిపి నాయకులు విమర్శిస్తున్నప్పటికీ కనీసం నోరు మెదపలేని స్థితిలో.. ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అ పల్లా శ్రీనివాసరావు ఉన్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. పల్లా శ్రీనివాస రావు వైసిపి కోవర్టుగా వ్యవహరిస్తున్నారని దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని రామ్ తెలిపారు. ఆదివారం ఉదయం హోటల్ దస్పల్లాలో "కాఫీ విత్ పల్లా శ్రీనివాసరావు బై బి.వి.రామ్ "పేరుతో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బి.వి.రావ్ మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై ఇష్టానుసారంగా విమర్శలు చేసిన గుడివాడ అమర్ కి, వైసిపి అక్రమాలకు పల్లా కొమ్ము కాస్తున్నట్టు వ్యాఖ్యానించారు. తాజాగా సింహాచలంలో ఘటన నేపథ్యంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేసినప్పటికీ కనీసం వల్ల శ్రీనివాసరావు స్పందించలేదన్నారు. ఇటువంటి వైసిపి కోవర్టును తక్షణమే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్ష స్థానం నుంచి తొలగించాలని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు బి.వి.రామ్ విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు ఎవరైనా వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

నేడు జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నగర మేయర్, ఇన్‌ఛార్జి కమిషనర్లు వెల్లడి

విశాలాంధ్ర-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాల లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం 2025 సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్.హరేంధిర ప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజనీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై నగర ప్రజలు మే 05 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్.హరేంధిర ప్రసాద్ తెలియచేశారు.

రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్

విశాలాంధ్ర-పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు రౌడీషీటర్లకు ఇన్స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ రౌడీ షీటర్లతో మాట్లాడుతూ, మంచి ప్రవర్తనతో, క్రమశిక్షణతో ఉండాలని, ఇకపై అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మీ కదలికలన్నీ పోలీసుల గమనంలో ఉంటాయని, మంచి ప్రవర్తనతో ఉంటే, రౌడీషీట్లను మూసివేయాలని పై అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. అంతేకాకుండా, నేరజీవితం వదిలి కుటుంబంతో కలిసి సమాజంలో మంచి జీవితాన్ని గడపాలని, పోలీస్ శాఖ సహకారంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కౌన్సిలింగ్‌కి హాజరైన రౌడీ షీటర్ల ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

2013-2014 టెన్త్ క్లాస్ బ్యాచ్

విశాలాంధ్ర-ఆనందపురం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90, 2013-14 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలు కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆనాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్న స్థితికి వెళ్ళినప్పుడు తల్లిదండ్రులతో పాటు గురువులకు ఎంతో గర్వకారణంగా ఉంటుందన్నారు. మీ వృత్తులతో పాటు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ పాత స్నేహితులందరినీ వివిధ వృత్తుల్లో ఉన్న వారందరినీ ఒక్కచోటకు తీసుకుని వచ్చి కష్టసుఖాలు పంచుకొని ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించడానికి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మనలో ఎవరికీ ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు చెప్పుకోవాలని అందరము ఐకమత్యంగా సమస్య పరిష్కారానికి పాలుపంచుకుంటామన్నారు. అప్పటి విద్యార్థుల్లో కొంతమంది మృతిచెందడంతో వారికి సామూహికంగా శ్రద్ధాంజలి ఘటించారు పాఠశాల విద్యార్థి తిరుపతిరావు ఆర్మీలో మృతి చెందడంతో ఆయనకి శ్రద్ధాంజలి ఘటించారు అప్పటి ఉపాధ్యాయులు ఎస్.వి.ఆర్.సత్యనారాయణ మరికొంతమంది మృతిచెందరంతో వారికి కూడా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధాన ఉపాధ్యాయులు సన్యాసిరావు ప్రస్తుత ఉపాధ్యాయులు కేఆర్కే పట్నాయక్, పిఈటి జాన్ రబ్బి, తెలుగు మాస్టర్ నాగమౌళి, చంద్రకుమారి, అశోక్ నంద, లక్ష్మీ తారకేశ్వరరావు, రాణి, వెంకట్ చతపతి తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని అలనాటి విద్యార్థులు సంపంగి అనిల్, బంటుపల్లి ఈశ్వరరావు, వంశీ, ఉప్పిలి వెంకట్, కంది రాంబాబు తదితరులు ఏర్పాటు చేయడంతో తోటి విద్యార్థులు ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

శతాబ్ది ఉత్సవాల్లో ఏయూ ఉద్యోగుల సహకారం కీలకం

ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాలలో ఏయూ సిబ్బంది సేవలు ఎంతో కీలకంగా నిలుస్తాయని వీసీ ఆచార్య జి.పిరాజశేఖర్ అన్నారు. ఏయు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఏయూ పరిపాలన భవనసిబ్బందిపాల్గొని నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. జిమ్నాసియం మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూఉద్యోగులు ప్రతివారం ఇటువంటి క్రీడా, వ్యాయామ సంబంధ కార్యక్రమాల్లో భాగం కావాలని సూచించారు. తద్వారా వారి ఆరోగ్యం మెరుగవుతుందని, సమర్థవంతమైన సేవలందించడానికి సాధ్యపడుతుందని చెప్పారు. ఉద్యోగులంతా తమకు నచ్చిన క్రీడాంశంలోరాణించాలని, శారీరక వ్యాయామాన్ని నిత్య జీవితంలో అంతర్భాగంగా మార్చుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ మోహన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, ఆచార్యులు, విద్యార్థులు సమన్వయంతో, సమిష్టిగా పనిచేస్తూ శతాబ్ది ఉత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేస్తారన్నారు. శారీరక ఆరోగ్యంపట్ల, వ్యాయామంపట్ల ఉద్యోగులు అవగాహన పెంచుకుంటున్నారని నిత్యం తమ క్రీడామైదానాలలో ఏయు ఉద్యోగులుకనిపిస్తారనిఅన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో పనిచేస్తున్న సిబ్బంది ఆరు జట్లుగా ఈపోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ధనుంజయరావు, డిసిఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఫైనాన్స్ ఆఫీసర్, డిప్యూటీ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, ఏయూ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.